క్లుప్తంగా

ఔదార్యం

రాయపర్తి : మండలంలోని సూర్య తండాకు చెందిన జూడో క్రీడాకారిణి మూనావత్ స్వాతికి మంగళవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సహకారంతో ఆర్థికసాయం అందించినట్లు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్ తెలిపారు. స్వాతి ఢిల్లీలో జరిగే జూడో క్రీడ పోటీలకు ఎంపికైనట్లు తెలుసుకొని సాయం అందించి ఔదార్యం చాటారు. మండల ఉపాధ్యక్షుడు ఉందాటి సతీష్, గుగులోత్ జాజునాయక్, ఎంపీటీసీ మూనావత్ వెంకన్న, జగన్, బాష బోయిన సుధాకర్, గారె కిరణ్, గోస్ నాయక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చేయూత



పర్వతగిరి : మండలంలోని బూర్గుమళ్ల గ్రామానికి చెందిన జయాకర్ ఇటీవల మృతి చెందాడు. కాగా, 1996–97 సంవత్సరంలో విశ్వభారతి హైస్కూల్‌లో జయాకర్‌తో కలిసి పదోతరగతి చదివిన విద్యార్థులు రూ.2లక్షలను సేకరించారు. అనంతరం రూ.2లక్షలకు సంబంధించిన ఎల్‌ఐసీ బాండ్‌ను మంగళవారం జయాకర్ భార్య, తల్లిదండ్రులకు స్నేహితులు అందజేశారు.

నియామకం



సిలువేరు విజయ

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం గ్రామానికి చెందిన సీపీఐ నాయకురాలు సిలువేరు విజయ భారత్ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ సమితి సభ్యురాలిగా నియామకం అయ్యారు. విజయ ప్రస్తుతం సీపీఐ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు.

గ్రామ కమిటీ ఎన్నిక



ఖానాపురం : ఖానాపురం మండల కేంద్రంలో పద్మశాలి సంఘం గ్రామ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కామని శంకర్, గౌరవ అధ్యక్షుడిగా గూడూరు కనకయ్య, దేవులపల్లి పెద్దయాలాద్రి, ఉపాధ్యక్షులుగా దేవులపెల్లి చిన్న యాలాద్రి, ఆడెపు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కర్నాటి యాదగిరి, కోశాధికారిగా సామల ప్రశాంత్, సభ్యులుగా పసునూరి దేవేందర్, కుసుమ రాజ్‌కుమార్, మేరుగు సాంబయ్య, వంగ మహేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కుడికాల సాంబయ్య, చిన్నరమేశ్, నర్సింహరావు పాల్గొన్నారు.

తరలిరావాలి

రాయపర్తి : పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో రేపు (గురువారం) కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి నామినేషన్ కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హామ్యా నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హాజరవుతున్నారని, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

వినూత్న సాగుకు శ్రీకారం

- పసుపులో అంతరపంటగా మిరప
- ప్రయోగాత్మకంగా సాగు చేసిన తొగర్రాయి రైతు



పసుపులో అంతర పంటగా సాగు చేసిన మిరప

దుగ్గొండి : శుభకార్యం అనగానే గుర్తుకొచ్చేది పసుపు.. వాణిజ్య పరమైన పంట మిరప.. ఈ రెండు పంటలను ఒకే పంటగా ప్రయోగాత్మకంగా సాగు చేశాడు మండలంలోని తొగర్రాయి గ్రామానికి చెందిన యువరైతు బుడిగొండ అశోక్.

రైతులు భూమిలో ఏడాది పొడవునా ఒకే పంట సాగు చేయడం వల్ల చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట పోతే అప్పులపాలవుతున్నారు. దీనికి విరుగుడుగా రైతు నష్టాల పాలుకాకుండా వినూత్నంగా పంటలు సాగు చేయాలని నిర్ణయించుకున్నాడు. అనుకున్నదే తడువుగా తనకున్న రెండు ఎకరాల భూమిని చదును చేసి బెడ్‌లు సిద్ధం చేశారు. ఒక బెడ్‌పై మూడు వరుసలలో పసుపు దుంపలు నాటాడు. దాని పక్కనే ఉన్న మరో బెడ్‌పై మల్చింగ్ పేపర్ వేసి రెండు వరుసల్లో మిరప మొక్కలు నాటాడు. ఇలా బెడ్ విడిచి బెడ్డు అంతర పంటలుగా మిరప, పసుపు సాగు చేశాడు. రెండు పంటలు చాలా ఆరోగ్యవంతంగా ఏపుగా పెరుగుతున్నాయి. ఎలాంటి చీడపీడల జాడలేదు. తక్కువ పెట్టుబడితో పసుపు అధిక సంఖ్యలో పిలకలు రాగా మిరప తోట మంచి పూత, కాత దశలో ఉంది. మార్కెట్‌లో రెండు పంటలలో ఏ పంటకు ధర ఉన్నా గిట్టుబాటు అవుతుందని, లేదా చీడ పీడలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి ఒక పంట పోయినా మరో పంట చేతికి అంది ఆదుకుంటుందని రైతు అంటున్నాడు. అలాగే ఇలా అంతర పంట సాగు వల్ల భూమిలో సారం పెరుగుతుందని తెలిపారు. అయితే పసుపులో మిరప అంతర పంట సాగు క్షేత్రం గిర్నిబావి–దుగ్గొండి ప్రధాన రహదారిని ఆనుకుని ఉండటంతో అటుగా ప్రయాణించే వారు ఈ పంటలను ఆసక్తిగా తిలకిస్తున్నారు.

ప్రయోగాత్మకంగా సాగు చేశా..



మిరప, పసుపు పంటలు రెండు పండాలంటే వాతావరణం అనుకూలించాలి. పండితే రైతు ఇళ్లు బంగారమే.. పండక పోతే అప్పుల పాలే.. అయితే ఎలాగైనా రెండు పంటలు అంతరపంటగా పండించాలని అనుకున్నా. బెడ్ పద్ధతిలో అంతర పంటలుగా మిరప, పసుపు సాగు చేశా. పసుపు యాంటీబయాటిక్‌గా ఉండి మిరపకు చీడపీడలు రావని నిర్ధారించుకుని రెండు ఎకరాల్లో సాగు చేశా. ఎకరం పసుపు, ఎకరం మిరప వేర్వేరుగా వేసేది కలిపి వేశా. దురదృష్టవశాత్తు ఒక పంట పోయినా మరో పంట చేతికి అందుతుంది. అయితే ప్రయోగాత్మకంగా చేసిన సాగు సత్ఫలితాలు ఇచ్చే విధంగానే ఉంది. ఇదే విజయవంతమైతే అన్నదాతలకు కొంత ఊరట కలుగుతుంది.

– బుడిగొండ అశోక్, రైతు, తొగర్రాయి

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



నర్సంపేట: గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి



రాయపర్తి : మంగమ్మను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

నర్సంపేట : బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీఆర్‌ఎస్ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు నల్లబెల్లి మండలం ఆసరవెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, రాంపూర్ గ్రామ సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ నాయకుడు కందిక రమేష్, నల్లబెల్లి మండల కేంద్రంలోని జనసేన పార్టీ నాయకులు, వార్డు మెంబర్లు బీఆర్‌ఎస్ లో చేరారు. పార్టీలో చేరిన వారికి సుదర్శన్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్ధన్నపేటలో..

వర్ధన్నపేట : వర్ధన్నపేట మున్సిపాలిటీ 3వ, 10వ వార్డుకు చెందిన వివిధ పార్టీల నాయకులు సుమారు 50 మంది మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి సోషల్ మీడియా ఇన్‌చార్జ్ అరూరి విశాల్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో ఇల్లందుల యాదగిరి, బర్ల సోమయ్య, కొండేటి శేఖర్, పసునూరి శ్రీకాంత్, అగ్రం గౌతం, తమ్మల రెడ్డి, కన్నం శశికాంత్, మారపల్లి శివ ఉండగా కొండేటి మధు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి మహిళా నాయకురాలు

రాయపర్తి : మండలంలోని కేశవాపురం జగ్యా తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకురాలు లకావత్ మంగమ్మ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరినట్లు తెలిపారు. మంగళవారం మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు, గ్రామ అధ్యక్షుడు మొలుగూరి పున్నమయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

నర్సంపేట : కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు నర్సంపేట పట్టణంలోని 4, 6, 16 వార్డులకు చెందిన పలువురు, నర్సంపేట మండలం గురిజాల గ్రామానికి చెందిన వివిధ పార్టీల నుంచి పలువురు, నల్లబెల్లి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన పలువురు, ఒల్లెనర్సయ్యపల్లి గ్రామానికి చెందిన టీడీపీ, బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు, మేడపల్లి, రాంపూర్ గ్రామ బీఆర్‌ఎస్, బీజేపీకి చెందిన పలువురు, చెన్నారావుపేట మండలం లింగాపురం గ్రామానికి చెందిన పలువురు, దుగ్గొండి మండలం బల్వంతపురం గ్రామానికి చెందిన పలువురు మంగళవారం దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

చెన్నారావుపేటలో..

చెన్నారావుపేట : మండలంలోని చెన్నారావుపేట, పాత మగ్దుంపురం, బోడ మాణిక్యం తండాతో పాటు పలు గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి పలువురు కార్యకర్తలు మంగళవారం దొంతి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కాంగ్రెస్‌లో చేరిన రెడ్డి సంఘం నాయకులు

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన రెడ్డి సంఘం నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌కు చెందిన రెడ్డి సంఘం అధ్యక్షుడు పగిడిపల్లి భీమారెడ్డి, లేతాకుల సుధాకర్ రెడ్డి, బొమ్మినేని రాజిరెడ్డి, ఈదులకంటి మహిపాల్ రెడ్డి, కోల అనిల్‌గౌడ్, విజయ్‌గౌడ్ పార్టీలో చేరగా కాంగ్రెస్ కండువాకప్పి వారిని ఆహ్వానించారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన దొనికెల రమేశ్‌గౌడ్ ఇటీవల గుండె పోటుతో మృతి చెందాడు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–96 విద్యా సంవత్సరంలో పదోతరగతి వరకు కలిసి చదువుకున్న బాల్య మిత్రులు మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు రూ. 55వేలు ఆర్థికసాయం అందజేశారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెరుమాండ్ల శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ చెరుకుపల్లి విజేందర్‌రెడ్డి, అందె వీరేశం, బొబ్బాల మహేందర్‌రెడ్డి, శంషోద్దిన్, కొలిపాక సతీష్ తదితరులు ఉన్నారు.

పరామర్శ

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల రిటైర్డ్ స్వీపర్ హుస్సేన్ మంగళవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. కాగా హుస్సేన్ మృతదేహాన్ని జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, బొమ్మినేని శ్రీనివాసరెడ్డి, జంగా రాజిరెడ్డి, నాగరబోయిన మోహన్, గుడిపెల్లి ధర్మారెడ్డి, నల్లా శ్యాంసుందర్ రెడ్డి, గుడిపెల్లి జనార్దన్‌రెడ్డి, గోవిందు రవీందర్, గుండెబోయిన ఖాజీ, ములుక నర్సింహారాములు, బోళ్ల వంశీ పాల్గొన్నారు.

రాయపర్తిలో..

రాయపర్తి : మండలంలోని గట్టికల్ గ్రామానికి చెందిన మేరుగు వెంకటేశ్వర్లు మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, వెంకటేశ్వర్లు మృతదేహానికి బీఆర్‌ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, సర్పంచ్ చిన్నాల వనజలక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కళారంగంలో రాణించాలి



ప్రదర్శనను తిలకిస్తున్న పాపమ్మ తదితరులు

చెన్నారావుపేట : విద్యార్థులు కళారంగంలో రాణించాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం మానుపాటి పాపమ్మ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం కళా ఉత్సవ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. గాత్ర సంగీతం, జానపదం, వాయిద్య సంగీతం, నృత్యాలు, విజువల్ ఆర్ట్స్, శాస్త్రీయ నృత్యాలు, ఇండిజీనస్ గేమ్స్, నాటికల పోటీలు నిర్వహించామన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన కళాకారులు ఈ నెల 9, 10 తేదీల్లో జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించినప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ జ్యోతి, పాపయ్యపేట కాంప్లెక్స్ హెచ్‌ఎం ప్రభాకర్ రావు, ఉపాధ్యాయులు పోలెపల్లి రవి, సంతోష్‌కుమార్, రవీందర్, సరిత, శైలజ, తేజస్విని, మాధవి, వెంకటేశ్వర్లు, సృజన, దేవిక, ఇందిర, ఎంఆర్‌సీ సిబ్బంది అశోక్, స్వప్న, సీఆర్‌పీలు సంపత్, స్వామి, బాలు, కందిక శిల్ప, హేమలత తదితరులు పాల్గొన్నారు.

‘దొంతిని కలిసిన ఆర్టీసీ ఉద్యోగులు’



మాధవరెడ్డిని సత్కరిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

నర్సంపేట : నర్సంపేట ఆర్టీసీ డిపో ఉద్యోగులు మంగళవారం మాధవరెడ్డిని కలిసి వారి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీని నిర్వీర్యం చేసి కార్మికులకు వేతనాలు, అలవెన్స్‌లు ఇవ్వలేని దుస్థితిలో సీఎం ఉన్నారని మాధవరెడ్డి తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు వారికి రావాల్సిన అలవెన్స్‌లు అన్ని ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పరిష్కరిస్తామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని ఓ కమిటీని ఏర్పాటు చేసి దానికి సమయపాలన లేకుండా చేయడం వెనక కుట్ర దాగి ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ ఉద్యోగులు ఈ రాష్ట్రంలోనే అందరికంటే ఎక్కువగా నష్టపోయారని, ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం రుణపడి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట నియోజకవర్గ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను విస్మరించిన బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న రంగయ్య

నర్సంపేట : దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడిచినా వ్యవసాయ కార్మికులు, దళితులు, పేదలు, కార్మికులు, నిరుద్యోగం, విద్య, వైద్యం వంటి అనేక సమస్యలను విస్మరిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య అన్నారు. ఈమేరకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అనంతగిరి రవి అధ్యక్షతన మంగళవారం పట్టణ కమిటీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ..అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అనుకూల శక్తులను ఓడించాలని వామపక్ష ప్రజాతంత్ర లౌకికశక్తులను బలపర్చడానికి సీపీఎం నిర్ణయం తీసుకుందన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్‌ఐసీ, బ్యాంకింగ్, బీఎస్‌ఎన్‌ఎల్, విమానయాన, రైల్వేలు, బొగ్గు ఉత్పత్తి సంస్థలను ప్రైవేటీకరణ చేయడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూనుకుందన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ అధికారంలోకి వస్తే దేశంలోని అన్ని రాష్ట్రాల్లో మతకలహాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. దేశంలో, రాష్ట్రంలో పార్లమెంటు, అసెంబ్లీలో కమ్యూనిస్టుల ప్రాబల్యం తగ్గిన తర్వాత ప్రజల హక్కులు ప్రజాతంత్ర వాదుల వాదనలకు సంబంధించిన అనేక సమస్యలను ప్రస్తావించగలిగే కమ్యూనిస్టులు చట్టసభల్లో లేకపోవడం ప్రజలందరికి తీవ్ర నష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొరబోయిన కుమారస్వామి, సీపీఎం పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్, పట్టణ నాయకులు గడ్డమీది బాలకృష్ణ, కందికొండ రాజు, జగన్నాధం, కార్తీక్, కలకోట అనిల్, ఎండి.ఫరీదా, బిట్ర స్వప్న, ఉదయగిరి నాగమణి, ఇంద్ర, విలియం కేరి, లక్ష్మి, యాకలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభకు తరలిన నాయకులు



సభకు వెళ్తున్న బీజేపీ నాయకులు

ఖానాపురం : మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఓబీసీ ఆత్మగౌరవ సభకు తరలివెళ్లారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరైనా ఈ సభకు ఆబోతు రాజు, జల్లి మధుల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. ఈ కార్యక్రమంలో లింగబత్తుల యాకసాయన్న, హరీశ్, కుమారస్వామి, రాజేందర్, నాంచారి కుమారస్వామి, లక్ష్మీ నారాయణ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నల్లబెల్లి : దుగ్గొండి మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు బరిగెల రాంచంద్రు(52) నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన కాంక్రీట్ మిల్లర్ కొత్తగట్టు గణేష్ వద్ద 15 ఏళ్లుగా పని చేస్తున్నాడు. కాగా శుక్రవారం శనిగరంలో స్లాబ్ పనులు ముగించుకొని తోటి కార్మికులతో కలిసి బోలేరో వాహనంలో తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో డ్రైవర్ కొత్తగట్టు శివ వాహనాన్ని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అతివేగంగా నడపడంతో నల్లబెల్లి మండల కేంద్రంలోని సామల దేవేందర్ ఇంటి సమీపంలోని మలుపు వద్ద వాహనం నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కూలీలు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య వనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విస్తృతంగా ఎన్నికల ప్రచారం

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆయా మండల కేంద్రాల్లో, గ్రామాల్లో పార్టీ అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారాలను విస్తృతం చేశారు. మంగళవారం నర్సంపేట నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి గెలుపు కోసం కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టణంలో ప్రచారం చేపట్టారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి దొంతి మాధవరెడ్డి తమ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అదేవిధంగా పరకాల నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి ఆయా మండల కేంద్రాలు, వివిధ గ్రామాల్లో తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోని పర్వతగిరిలో అరూరి రమేష్ చేపట్టనున్న ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనాలని స్థానికులు సమావేశం నిర్వహించారు. అభ్యర్థుల వెంట ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

‘దళితబంధు’తో ఆర్థికాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

చెన్నారావుపేట : దళితులను ఆర్థికంగా ఆదుకోవడానికే దళితబంధు పథకాన్ని కేసీఆర్ ప్రవేశపెట్టారని ఎస్సీ సెల్ బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కల్లెపల్లి సురేష్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నమిండ్ల సురేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశంలో డివిజన్ సమన్వయ కమిటీ సభ్యులు కోట డేవిడ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆరెపల్లి బాబు, మైసీ శోభన్, సాధు నర్సింగరావు, మాదాసి కుమారస్వామి, కడగండ్ల యాకయ్య, నర్మెట్ట సాంబయ్య, యాకూబ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

‘సాక్షి మ్యాథ్స్‌బీ’కి విశేష స్పందన

హసన్‌పర్తి : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ‘సాక్షి’ ఆధ్వర్యంలో మంగళవారం మ్యాథ్స్ బీ ప్రాథమిక స్థాయి పరీక్ష నగరంలోని స్కై ఇంటర్నేషనల్ స్కూల్, తాళ్లపద్మావతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్, లర్నస్ ల్యాండ్ హై స్కూల్, రామన్ హైస్కూల్, షైన్ హైస్కూల్, క్రియేటివ్ హైస్కూల్, సాయి ట్యుటోరియల్స్, వండర్ కిడ్స్‌తో పాటు వివిధ పాఠశాలల్లో మంగళవారం ఈ పరీక్ష నిర్వహించారు. పరీక్షకు ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ ‘సాక్షి’ బ్రాంచ్ మేనేజర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ ‘సాక్షి’ నిర్వహిస్తున్న మ్యాథ్స్ బీ పోటీ పరీక్షతో విద్యార్థులకు గణితంపై పట్టు పెరుగుతోందన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ పాటవాలను వెలికితీయడంలో ‘సాక్షి’ ఎప్పుడు ముందంజలో ఉంటోందని శ్రీనివాస్ తెలిపారు. ఇలాంటి పోటీ పరీక్షల్లో పాల్గొనడానికి ఆసక్తి గల విద్యార్థులు ఫోన్ నంబర్ 95055 14424 సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ గడ్డం రాజిరెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జ్ లింగయ్య , ఈవెంట్స్ మేనేజర్ ఎస్.సుమన్ గుప్తా, సాక్షి బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు.



సాక్షి మ్యాథ్స్ బీ పరీక్ష రాస్తున్న రామన్ హై స్కూల్ విద్యార్థులు



భీమారంలోని స్కై హై స్కూల్‌లో సాక్షి మ్యాథ్స్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

‘సాక్షి’ మ్యాథ్స్ బీ తో విజ్ఞానం పెరుగుతోంది



‘సాక్షి’ మ్యాథ్స్ బీ నిర్వహించిన పోటీ పరీక్షలతో విజ్ఞానం పెరుగుతోంది. పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షలపై అవగాహన కల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ‘సాక్షి’ ఆధ్వర్యంలో ఇలాంటి పరీక్షలు మరిన్ని నిర్వహించాలి.

– టి. హాసిని, 8వ తరగతి (క్రియేటివ్ స్కూల్)

సమయం ఆదా



పోటీ పరీక్షల్లో సమయం ఎలా ఆదా చేసుకోవాలో తెలిసింది. భవిష్యత్‌లో రాసే పోటీ పరీక్షల్లో తక్కువ సమయంలో ఎక్కువ సమాధానాలు సాక్షి మ్యాథ్స్ బీ ద్వారా తెలుసుకున్నా.

– డి.ప్రద్వీక్, 7వ తరగతి (శ్రీసాయి ట్యుటోరియల్స్)

మ్యాథ్స్‌పై అవగాహన



మ్యాథ్స్ బీ పోటీ పరీక్షలతో గణితంపై అవగాహన కలిగింది. పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల భయం అనేది లేకుండా పోతోంది. భవిష్యత్‌లో పోటీ పరీక్షలు దోహదపడుతాయి.

– మహార సమీనా ,4వ తరగతి (లర్నస్ ల్యాండ్ హైస్కూల్)

ప్రతి అంశంపై పట్టు



మ్యాథ్స్ బీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల సరికొత్త విషయాలు తెలుసుకోగలిగా. ప్రతి అంశంపై పట్టు సాధించా. భవిష్యత్‌లో ఉన్నత చదువులకు, పోటీ పరీక్షలకు మ్యాథ్స్ బీ ఎంత గానో దోహదపడుతోంది.

– సీహెచ్.దీక్షిత, 9వ తరగతి (తాళ్ల పద్మావతి స్కూల్)

ఉన్నత చదువులకు ఎంతో ఉపయోగకరం



ఇలాంటి పరీక్షలు ఉన్నత చదువులకు ఎంతో దోహదపడుతాయి. భవిష్యత్‌లో గణితవిద్యకు ఇది ఒక వారధిగా, సులువుగా ఉపయోగపడుతుంది.

– పి. మన్విత్ సాయి, 5వ తరగతి (షైన్ స్కూల్)

ప్రాథమిక విద్యలోనే పరీక్ష రాయడం సంతోషం



ప్రాథమిక విద్యలోనే పోటీ పరీక్షల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది. పరీక్ష రాయడానికి కష్టపడి చదివా. ‘సాక్షి’ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతి పోటీ పరీక్షల్లో పాల్గొంటా.

– కె. నిధి, 4వ తరగతి (వండర్ కిడ్స్ స్కూల్)